సాక్షి
హనుమకొండ
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించి పాలనలో భాగస్వాములను చేశారని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. - 8లో▸



ప్రశాంతంగా ఎస్సై రాత పరీక్షలు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల పాటు జరిగిన సబ్ ఇన్‌స్పెక్టర్ల రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 21 పరీక్ష కేంద్రాలలో నిర్వహించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$38^0/24^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. అధిక వేడి కారణంగా రాత్రి ఉక్కపోత ఉంటుంది.



వసంతోత్సవానికి వీడ్కోలు

నిట్‌లో ముగిసిన 'స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వని'

- సెలబ్రెటీ టాక్‌లతో అలరించిన డైరెక్టర్లు వేణు ఉడుగుల, తరుణ్‌భాస్కర్
- ప్రో షోలో ఉర్రూతలూగించిన మోహన్ సిస్టర్స్, డీజే స్వాస్ట్రెక్స్



చిట్‌చాట్‌లో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో మూడు రోజులుగా విద్యార్థులు నిర్వహిస్తున్న వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వని ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. వివిధ కళాశాలల నుంచి వచ్చిన పదివేల మంది విద్యార్థులు 'బై బై స్ప్రింగ్ స్ప్రీ' అంటూ వీడ్కోలు పలికారు. 55 ఈవెంట్లు, ప్రోషోలు, ఆర్టీ, డీజే నైట్‌లతోపాటు గెస్ట్ లెక్చర్స్, సెలబ్రిటీ గెస్ట్‌లతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. డైరెక్టర్ కట్‌లో భాగంగా సినీ దర్శకులు వేణు ఉడుగుల, తరుణ్‌భాస్కర్ విద్యార్థులతో చిట్ చాట్ చేసి అలరించారు. హోప్ ఫర్ టుమారో పేరిట సైకాలజిస్ట్ విశేష్ ఆకట్టుకున్నారు.



హ్యాండ్ టు హ్యాండ్ పోటీ..



హ్యాండ్ ప్రింట్..



డైరెక్టర్ కట్ ..
వేణు ఉడుగుల, దర్శకుడు

- మీకు జాబ్, డైరెక్షన్‌లో ఏది ఇష్టం?
- నాకు జాబ్ అంటేనే ఎలర్జీ. డైరెక్టర్ అవ్వాలనద్దే చాలా ఇష్టం. ఇందుకోసమే విద్యనభ్యసించిన తర్వాత జాబ్‌కు వెళ్లలేదు. డైరెక్షన్ వైపు అడుగులు వేశాను.
- సినిమా చాన్స్ ఎలా వచ్చింది?
- సినిమా రంగంలో డైరెక్షన్ చేయాలనే తపనతో సినిమా రంగంలో అడుగుపెట్టాను. ఆర్జీవీ వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో మెళకువలు నేర్చుకున్నాను. డైరెక్షన్ చేస్తుండగా 'నీది నాది ఒకే కథ' సినిమా అవకాశాన్ని ప్రొడ్యూసర్ అందించారు.
- విరాటపర్వం లాంటి కథకు స్ఫూర్తి ఎవరు?
- ఓరుగల్లు జిల్లాలో పుట్టిన నేను నా చుట్టు పక్కన చోటు చేసుకున్న సంఘటనలకు జీవం పోయాలని.. ఓ సినిమాగా మలచాలనే ఆలోచనతోనే విరాటపర్వం సినిమా తీశాను.



విద్యార్థులతో చిట్‌చాట్..
తరుణ్‌భాస్కర్ డైరెక్టర్

- డైరెక్టర్ కాకపోతే ఏమయ్యేవారు?
- నాకు కుకింగ్ అంటే చాలా ఇష్టం. నేను డైరెక్టర్ కాకపోతే మంచి చెఫ్‌ని అయ్యేవాడిని. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రంగంలోకి అడుగు పెట్టాలి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీటెక్ చదువుతుండగా స్టడీపై ఆసక్తి లేదని నా మిత్రుడు కౌశిక్‌కు చెప్పగా స్టోరీలు రాయమన్నాడు. ఆవిధంగా షార్ట్ ఫిల్మ్‌లతో మూవీస్‌లోకి వచ్చాను.
- మీకిష్టమైన డైరెక్టర్, మీ రాబోయే సినిమాలు?
- నాకు మణిరత్నం, సింగీతం శ్రీనివాస్ అంటే చాలా ఇష్టం. క్రైమ్ కామెడీతో నేను కీడాకోయిల పేరుతో ఓ సినిమా చేస్తున్నాను. 'పెళ్లి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది' సినిమాల కంటే విభిన్నంగా ఉంటుంది. ఇందులో బ్రహ్మానందం ప్రత్యేకంగా కనిపించనున్నారు.
- ఇటీవలి కాలంలో మీకు నచ్చిన సినిమా?
- బలగం సినిమా బాగా నచ్చింది. మన సంస్కృతి సంప్రదాయాలు, తెలంగాణ యాస కట్టిపడేసింది. కొత్త వారు చేసే సినిమాలను తప్పక ఆదరించండి. నాకు నచ్చిన హీరో హీరోయిన్లు జూనియర్ ఎన్టీఆర్, మహేష్‌బాబు, సమంత.
- సినీ రంగంలోకి ఎలా అడుగుపెట్టాలి?
- సినీ రంగంలోకి రావాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. ఇంటర్నెట్‌లో అన్ని అందుబాటులో ఉన్నాయి. ట్రెయినింగ్ పేరిట డబ్బులు ఖర్చు పెట్టకుండా గూగుల్, యూట్యూబ్‌లో నేర్చుకుంటే చాలు.

ఎన్ఐటీ హౌ ఆర్ యూ లెట్స్ రాక్.. మోహన్ సిస్టర్స్

నిట్ మైదానంలో ప్రోషోలో భాగంగా ఇంటర్నేషనల్ పాప్ సింగర్స్ శక్తిమోహన్, నీతి మోహన్, క్రితీ మోహన్ ముగ్గురు అక్క చెల్లెలు విద్యార్థులతో 'ఎన్ఐటీ హౌ ఆర్ యూ లెట్స్ రాక్' అంటూ ఉర్రూతలూగించారు. 'ఐయామ్ ఏ బ్యాడ్ గర్ల్, బ్యాడ్ బాయ్, ఆజా నాచ్‌లే, కానా రే కానా, నారీ యారీ' అంటూ పాటలతో అలరించి ఆటలతో అదరగొట్టారు. కమాన్ నిట్ వరంగల్ డ్యాన్స్ అంటూ డీజే స్వాస్ట్రెక్స్ అలరించారు.



డ్యాన్స్ చేస్తున్న మోహన్ సిస్టర్స్

ఆశ మనిషిని బతికిస్తుంది.. విశేష్, సైకాలజిస్ట్



రేపు ఉదయం మళ్లీ లేస్తాం అనే ఆశనే మనిషిని బతికిస్తుంది. హోప్ ఫర్ టుమారో అనే నమ్మకంతో ముందుకు సాగాలి. యుక్త వయసులోనే విద్యార్థులు ఆకర్షణకు లోనై ప్రేమ అనుకుని జీవితాలను చేజార్చుకుంటున్నారు. ఆకర్షణ, ప్రేమకు తేడా తెలుసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతి విషయాన్ని గట్టిగా చెప్పకుండా సున్నితంగా తెలపాలి. ఒత్తిడిని జయిస్తే ఆత్మహత్యలకు తావులేదు. మానసిక ధైర్యంతో జీవితంలో రాణించాలి.





మోహన్ సిస్టర్స్ ఆట పాటలకు కేరింతలు కొడుతున్న విద్యార్థులు



కార్యక్రమాన్ని తిలకిస్తున్న నిట్ డైరెక్టర్, డీన్‌లు, ప్రొఫెసర్లు తదితరులు

న్యూస్‌రీల్

పీహెచ్‌డీ ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్, సోషల్‌సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్, ఫార్మసీ, ఇంజనీరింగ్, లా విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు కేయూ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆయా విభాగాల డీన్‌లు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 10వ తేదీతో గడువు ముగియనుండడంతో దానిని పొడిగించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్ వెబ్ సైట్‌లో చూడవచ్చని సూచించారు.

13 నుంచి టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకనం

- సంబంధిత టీచర్లు రిపోర్టు చేయాలి
- డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: టెన్త్ వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం కాజీపేటలోని ప్రభుత్వ ఎయిడెడ్ ఫాతిమా హైస్కూల్‌లో ఈనెల 13 నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు తెలుగు, హిందీ ఇంగ్లిష్, సైన్స్, మాథమెటిక్స్ మూల్యాంకనానికి సీఈలు, ఏఈలుగా అలాట్ అయిన టీచర్లు ఈనెల 13న ఉదయం 8.00 గంటలకు రిపోర్టు చేయాలని హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై కోరారు. టెన్త్ ప్రధాన పరీక్షలు ఈనెల 11వ తేదీతో ముగియనున్నాయి. సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు మాత్రం ఈనెల 14న ఉదయం 8.00 గంటలకు ఫాతిమా స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ముగిసిన రథోత్సవం



వరంగల్ చౌరస్తా: భూ నీలాదేవి సమేత గోవిందరాజ స్వామి రథోత్సవం ముగిసింది. ఆదివారం పెద్ద రథయాత్ర గిర్మాజీపేటలోని హనుమత్ చంద్రశేఖర శివాలయం వద్దకు చేరగా అర్చకుల బృందం, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చింతాకుల సునీల్ ఆధ్వర్యంలో జంగం వీధి, ముదిరాజ్ వాడ మీదుగా గర్భగుడికి చేరుకుంది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

రేపు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

కాజీపేట అర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు క్రాస్ రోడ్డులోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, కులసంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

ఆ విద్యార్థికి అనుమతి

- నేటి నుంచి పరీక్షలు రాయనున్న హరీశ్

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా కమలాపూర్ జెడ్పీహెచ్ఎస్ బాలుర హైస్కూల్ పరీక్ష కేంద్రంలో టెన్త్ హిందీ ప్రశ్న పత్రం లీక్ వ్యవహారంలో డీబార్ అయిన విద్యార్థి హరీశ్ సోమవారం నుంచి పరీక్షలు రాయనున్నాడు. హరీశ్ విషయమై విద్యాశాఖ అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విద్యార్థి తండ్రి హైకోర్టును ఆశ్రయించడంతో శనివారం విచారణ చేపట్టి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. సోమవారం నుంచి మిగతా పరీక్షలకు అనుమతించాలని విద్యాశాఖను హైకోర్టు ఆదేశించగా ఎస్సెస్సీ పరీక్షల బోర్డు, ప్రభుత్వ పరీక్షల విభాగం, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హనుమకొండ డీఈఓ ఎండీ. అబ్దుల్‌హై విద్యార్థి హరీశ్‌కు మిగతా పరీక్షలు రాసేందుకు అనుమతించారు. ఈ మేరకు సంబంధిత పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు కూడా సమాచారం అందించారని డీఈఓ కార్యాలయ ఏసీజీ చలపతిరావు తెలిపారు. సోమవారం హరీశ్ సైన్స్ పరీక్ష రాయబోతున్నాడు.

దివ్యాంగులకు సర్కారు చేయూత

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్



టెన్త్ విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న చీఫ్‌విప్, ఫౌండేషన్ బాధ్యులు, తదితరులు

విద్యారణ్యపురి: దివ్యాంగులకు పెన్షన్ రూపంలో రాష్ట్ర సర్కారు చేయూతనిస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ అన్నారు. విద్యాఫౌండేషన్ తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హనుమకొండలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగ, అనాథ విద్యార్థుల కోసం విద్యాఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, దివ్యాంగుల కోఆర్డనేషన్ కమిటీ మెంబర్ బిల్ల మహేందర్ కవిగా, ఉపాధ్యాయుడిగానే కాకుండా దివ్యాంగ సాధికారితకు కృషి చేయడం గొప్పవిషయమన్నారు. 'కుడా' చైర్మన్ సుందర్‌రాజుయాదవ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి, కవి, రచయిత పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, రెడ్ క్రాస్‌సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ. శ్రీనివాస్‌రావు, పెద్ది వెంకటనారాయణ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు మహేందర్ మాట్లాడారు. అనంతరం 2021-22 టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది దివ్యాంగ, అనాథ విద్యార్థులకు విద్యాఫౌండేషన్ తరపున ప్రతిభా పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.1,016 చొప్పన, మెమొంటో, ప్రశంసపత్రం అందజేశారు. అలాగే దివ్యాంగ అనాథలకు సేవలందిస్తున్న ఐదుగురికి సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి ఫణిమాధవి, హనుమకొండ డీఈఓ కార్యాలయం కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బి.రాధ, రిటైర్డ్ ప్రొఫెసర్ రామలక్ష్మి, డాక్టర్ లక్కిరెడ్డి సత్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ ఫౌండేషన్‌కు రూ.10వేలు అందజేశారు.

నీటి సరఫరాలో సమయపాలన పాటించండి

- నగర మేయర్ గుండు సుధారాణి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: తాగునీటి సరఫరాలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు సమాచారం ఇవ్వాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. ఆదివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీర్లతో సమావేశమై అండర్ రైల్వేజోన్ ప్రాంతం, దేశాయిపేట్ ఫిల్టర్‌బెడ్ నీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత శనివారం అండర్ రైల్వేజోన్ పరిధి ఖిలా వరంగల్ ప్రాంతంలో తాగునీటి సరఫరా ఎందుకు చేయలేదని అడగ్గా.. రెండో శనివారం అయినందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన నేపథ్యంలో ధర్మసాగర్ నుంచి రా వాటర్ సప్లై కాలేదని అధికారులు వివరించారు. ఈ విషయమై ధర్మసాగర్ రిజర్వాయర్ అధికారులతో మేయర్ ఫోన్‌లో ఆరా తీశారు. ఏదైనా కారణంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఆ ప్రాంత ప్రజలకు ముందస్తుగా తెలియచేయాలని, లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని అండర్ రైల్వేజోన్ పరిధి అన్ని ట్యాంకులను లైన్‌మెన్లు షెడ్యూల్ ప్రకారం నింపుకొని నిర్ణయించిన సమయం ప్రకారం సరఫరా చేయాలని చెప్పారు. దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి గాయత్రినగర్ వాటర్ ట్యాంకు నింపి సంతోషిమాత కాలనీ ప్రజలకు నీరు అందించాలన్నారు. ఈ ఫిల్టర్‌బెడ్ వాల్వ్ చెడిపోయినందున చార్‌బౌళి తదితర ప్రాంతాలకు గత శనివారం నీటి సరఫరా జరగలేదని, సమస్యలు ఉత్పన్నమైతే తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. సమీక్షలో డీఈ రవికిరణ్, ఏఈలు ముజంమిల్, హబీబుద్దీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి కౌన్సిల్ హాల్‌లో రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

నిఘా, నీడ కరువు

స్థలాలు లేక రోడ్లపైనే గ్రేటర్ వాహనాల పార్కింగ్

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- మూడు వాహనాల బ్యాటరీలు, ఇతర పరికరాలు మాయం
- పట్టించుకోని పాలకులు, అధికారులు





బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట స్మార్ట్‌సిటీ రోడ్డుపై వాహనాల పార్కింగ్

వరంగల్ అర్బన్: రూ.కోట్లు వెచ్చించి కొన్న వాహనాలు అవి. అంత విలువైన వాహనాలను కాపాడుకుందామన్నా ఆలోచన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులకు, పాలకులకు లేదు. ఎండకు ఎండుతూ, వానకు తడిసి పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. నిఘా కరువై బ్యాటరీలాంటి పరికరాలు మాయమవుతున్నాయి. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపై వాహనాలను నిలిపి ఇతర వాహనదారులకు అంతరాయం కలిగిస్తున్నారు.

బాధ్యత లేకనే..

ప్రభుత్వ సంస్థలంటే ఎవరికి వారు యాంత్రికంగా పనిచేసుకోవడం తప్ప బాధ్యత ఉండదనే విమర్శలు వినిపిస్తుంటాయి. వాటిని నిజం చేస్తున్నారు వరంగల్ బల్దియా అధికారులు. పారిశుద్ధ్య విభాగంలో గతంలో 232 పాత వాహనాలు ఉండగా, బల్దియా రెండేళ్ల కిందట రూ.42.30కోట్లు వెచ్చించి 278 కొత్త వాహనాలు కొనుగోలు చేసింది.

ప్రత్యేక పర్యవేక్షణ కరువు

గ్రేటర్ హైదరాబాద్‌లో వాహనాల పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం ఉంటుంది. దీన్ని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. హనుమకొండ బాలసముద్రంలో వెహికిల్ డిపో ఉంది. డీఈకి ఇన్‌చార్జ్ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించగా.. ఏఈ నియమించారు. ఐదుగురు మెకానిక్‌లు, ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. వీటి నిర్వహణ కోసం ఏటా రూ.1.60కోట్ల వరకు నిధులు వెచ్చిస్తున్నారు. నిధులు ఖర్చవుతున్నా వాహనాలు మరమ్మతులకు నోచుకోక, సరైన పర్యవేక్షణ లేక మూలకు చేరుకుంటున్నాయి. ఒకవైపు వాహనాలకు వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ లేక రూ.లక్షలాది డీజిల్ దుర్వినియోగమవుతోంది. మరోవైపు వాహనాల పరికరాలు సైతం మాయమవుతున్నాయి.

రోడ్లు, చెట్లకింద పార్కింగ్

బల్దియాకు మొత్తం 510 సొంత వాహనాలు ఉన్నాయి. కానీ వీటికి సరైన పార్కింగ్ సౌకర్యం లేదు. చెట్లకింద, రోడ్లపై నిలుపుతున్నారు. డ్రైవర్లు పక్షం రోజుల నాటి వరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇండోర్ స్టేడియం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో, బాలసముద్రం వెహికిల్ డిపోలో పార్కింగ్ చేస్తున్నారు. బల్దియా ఆవరణ స్థలంలో ప్రస్తుతం పరిపాలన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో వాహనాలను నిలిపేందుకు స్థలాలు లేవు. బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి భద్రకాళి దేవాలయం వెళ్లేందుకు ఇటీవల నిర్మించిన స్మార్ట్‌సిటీ రోడ్డుపై నిలుపుతున్నారు. నెల రోజుల కిందట అప్పటి కమిషనర్, ప్రస్తుత ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసి, అక్కడే చేయాలని ఆదేశించారు. కానీ అధికారులెవరూ చెవికెక్కించుకోవడం లేదు. డ్రైవర్లు చేసేదేమీ లేక అందుబాటులో డీజిల్ పంపిణీ చేసే పెట్రోల్ ఉండడం వల్ల స్మార్ట్‌సిటీ రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలకు నిఘా లేక ఇటీవల మూడు వాహనాల బ్యాటరీలను దొంగలు అపహరించారు. ఈ విషయంపై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో సీఎంహెచ్‌ఓ రాజేష్ ఫిర్యాదు కూడా చేశారు. అంతే కాకుండా స్మార్ట్‌సిటీ రోడ్డుపై వాహనాల పార్కింగ్ వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బల్దియా పాలకవర్గ పెద్దలు, ఇంజనీర్లు చొరవ తీసుకొని కోట్లాది రూపాయల విలువచేసే వాహనాలకు పార్కింగ్,నిఘా,ప్రహరీ, ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

స్థలాలను పరిశీలిస్తున్నాం..

పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపై, చెట్లకింద వాహనాలు నిలుపుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు స్థలాలను ఎంపిక చేసే పనిలో ఉన్నారు. తదుపరి ప్రహరీ, నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తాం.

– సంజయ్‌కుమార్,
బల్దియా ఈఈ, వెహికిల్ ఇన్‌చార్జ్

ఉత్సాహంగా కిక్ బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. హనుమకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఒలింపిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.కైలాస్‌యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయన్నారు. అండర్-12,14, 16 బాలబాలికల విభాగంలో జిల్లా నుంచి 200ల మంది క్రీడాకారులు హాజరయ్యారని, వారికి మ్యూజికల్ ఫామ్, పాయింట్ ఫైటింగ్, లైట్ కాంటాక్ట్ కేటగిరీలో పోటీలు నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ బండారి సంతోష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30 తేదీ ల్లో మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, ఒలింపిక్, కిక్‌బాక్సింగ్ సంఘాల బాధ్యులు తోట శ్యాం, పులి రజనీకాంత్, సిరిగిరి తిరుపతి, సీహెచ్.సుప్రియ, ఎస్.శివ, పి.దినేష్, ఎ.గణేష్, వైష్ణవి, రణదీప్, దేవదాస్, కె.వెంకటేష్, కరుణాకర్, రూపేష్, భాస్కర్ పాల్గొన్నారు.



కిక్ బాక్సింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న కైలాస్‌యాదవ్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

ములుగు రూరల్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సర్వాపూర్ పంచాయతీ పరిధి లాలాయిగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాయిగూడెంకు చెందిన సల్లూరి లచ్చయ్య (75) తన భార్యతో గొడవ పడి క్షణికావేశంలో ఆదివారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. లచ్చయ్య కుమారుడు వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

కుక్కలను చంపిన ఘటనపై విచారణ

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో కుక్కలను చంపిన ఘటనపై వెటర్నరీ అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలో కుక్కలను చంపారనే వీడియో యానిమల్ యాక్ట్‌కు చేరింది. దీంతో అక్కడి నుంచి జిల్లా వెటర్నరీ అధికారులకు పంపి విచారణ చేపట్టాలని సూచించారు. జిల్లా వెటర్నరీ జేడీ బాలకృష్ణ ఆదివారం ఖానాపురంలో విచారణ కుక్కలను ఎవరు చంపారనే వివరాలను సేకరించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి శ్రీలక్ష్మి, తదితరులు ఉన్నారు. కాగా, ఇదే అంశంపై ఇతర శాఖ అధికారులకు సైతం సమాచారం అందినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఇతర శాఖ అధికారులు సైతం విచారణ జరపనున్నట్లు తెలిసింది.

విరబూసిన బ్రహ్మకమలం



వరంగల్: నగరంలోని గోపాలస్వామిగుడి మట్టెవాడకు చెందిన గోరంటల మనోహర్ మాధవి ఇంటిఆవరణలో బ్రహ్మ కమలం పుష్పాలు విరబూసాయి. ఆరు నెలల కింద కార్తీక మాసం మొదటి సోమవారం ఒక పుష్పం .. మళ్లీ ఈరోజు రెండు పుష్పాలు పూయడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఏడాదికి ఒక పుష్పం పూయడమే ఎక్కువైతే సంవత్సరంలోనే మూడు పుష్పాలు పూయడంతో స్థానికులు పుష్పాన్ని సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీసుకున్నారు.

నెపియర్ గడ్డితో ఆదాయం

- ఏడాదిలో ఎకరాకు 200 టన్నుల దిగుబడి
- నెపియర్‌తో గ్యాస్, బొగ్గు, రంగుల ఉత్పత్తి



నెపియర్ గడ్డి

దుగ్గొండి: నెపియర్ గడ్డి.. గ్యాస్, బొగ్గు, రంగుల తయారీలో వినియోగించే ఈ గడ్డితో ఇప్పుడు జిల్లాలోని పలువురు రైతులు ఆదాయం గడించే పనిలోపడ్డారు. అన్నదాతల సమూహాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేస్తుంది. సంఘాలు ఏర్పాటు చేసుకుని పరిశ్రమలు స్థాపించుకుంటే 50శాతం సబ్సిడీ ఇస్తుంది. చమురు ధరలు పెరగడం వల్ల జీవ ఇంధనాల అవసరం ఏర్పడింది. సీఎన్‌జీ, పీఎన్‌జీ ల అవసరం రోజు రోజుకూ పెరిగిపోతుంది. దీనిని అధిగమించడానికి గ్యాస్ ఉత్పత్తులకు మూలమైన నెపియర్ గడ్డి పెంపకం అన్నదాతలకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉంది. దీంతో పాటు రసాయనిక వ్యవసాయానికి స్వస్తి చెప్పి సేంద్రియ సాగుకు బాటలు పడనున్నాయి.

నెపియర్ గడ్డి..

నెపియర్ గడ్డి నాటిన 5నెలలకు తొలికోత వస్తుంది. ఎకరాకు 100 టన్నుల దిగుబడి వస్తుంది. ఇలా ఏడాదిలో రెండు సార్లు 200 టన్నుల దిగుబడి వస్తుంది. దీనిని సాధారణంగా గ్రామాల్లో పాడిపశువులకు వినియోగిస్తున్నారు. అయితే నెపియర్ గడ్డి నుంచి బొగ్గు, మోటారు వాహనాలకు వినియోగించే సీఎన్‌జీ, ఇంటి అవసరాలకు వినియోగించే పీఎన్‌జీ, రంగుల తయారీతో పాటు ఆర్గానిక్ ఎరువులు తయారు చేసుకునే అవకాశం ఉంది. నెపియర్ గడ్డిని టన్నుకు రూ.1,000 చొప్పున కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థ రైతులనుంచి 30 సంవత్సరాలకు గాను అగ్రిమెంట్ చేసుకుంటుంది. విత్తనాలు, ఎరువులు వారే అందిస్తారు. వచ్చిన దిగుబడిని సైతం వారే పంట చేనువద్దనే కొనుగోలు చేసి వారే రవాణా చేసుకుంటారు. ఇందు కోసం మీరాక్లీన్ ఫ్యూయల్స్ లిమిటెడ్ సంస్థ త్వరలోనే రైతులకు అవగాహన కల్పించనుంది.

రైతులకు లాభదాయకం..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నెపియర్ గడ్డి పెంపకం నుంచి ఫ్యూయల్స్ తయారీతో రైతులకు లాభం ఉంటుంది. ఇతర పంటల మాదిరిగా ధరల హెచ్చుతగ్గుల వల్ల నష్టపోయే ప్రమాదం ఉండదు. ప్రభుత్వ నిర్ధేశిత ధరకు అనుమతి పొందిన ఫ్యాక్టరీ కొనుగోలు చేస్తుంది. ఎకరాకు ఖర్చులు పోగా రూ. 1.50లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. నెపియర్ గడ్డి ఒకసారి వేస్తే 8 సంవత్సరాల పాటు ఏడాదికి రెండుసార్లు దిగుబడి ఇస్తుంది.

– సాంబశివరావు, మీరాక్లీన్ ఫ్యూయల్స్ ప్రతినిధి

నకిలీ పోలీస్ గ్యాంగ్ అరెస్ట్

- పోలీసులమని చెప్పి పౌల్ట్రీ పామ్ నిర్వాహకుడికి బెదిరింపులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు శ్రీకాంత్, రమేష్

పాలకుర్తి టౌన్: పోలీసులమని చెప్పి.. పౌల్ట్రీపామ్ నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నకిలీ పోలీసుల గ్యాంగ్‌ను పోలీసుల అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు వెల్లడించిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన పడమటింటి నవీన్, చుక్క యాకస్వామి, నామాల ఉదయ్, జిలుకర సోమేశ్వర్‌లు రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కష్టపడకుండా ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ పోలీసుల అవతారం ఎత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారానికి చెందిన పౌల్ట్రీపామ్ నిర్వహించే ధరావత్ సాయికిరణ్‌కు కోళ్లకు దాణా నిమిత్తం రేషన్ బియ్యం అవసరం కాగా అతని అవసరాన్ని గుర్తించిన నలుగురు నిందితులు మార్చి 30న సాయికిరణ్‌కు ఫోన్ చేసి తమ వద్ద 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని కొనేందుకు రావాలని సమాచారం అందించారు. సాయికిరణ్ రేషన్ బియ్యం కొనేందుకు లక్ష్మక్కపల్లికి వచ్చాడు. ప్రణాళిక ప్రకారం ఇద్దరు నిందితులు సాయికిరణ్ వెంట ఉండి రేషన్ బియ్యం అతనికి అప్పగించారు. సదరు బియ్యాన్ని వాహనంలో లోడ్ చేశారు. మరో ఇద్దరు ప్లాన్ ప్రకారం పోలీసులమని చెప్పి రేషన్ బియ్యం లోడ్ చేసిన వాహనాన్ని ఆపి కొడకండ్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లమని కేసు నమోదు చేస్తామని బెదిరించారు. బయపడిన సాయికిరణ్ తప్పనిసరి పరిస్థితుల్లో రూ.30 వేల నిందితుల నంబర్లకు ఫోన్ పే చేశాడు. రేషన్ బియ్యాన్ని సైతం తిరిగి నిందితులు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై సాయికిరణ్ ఆరా తీయగా వారు పోలీసులు కారని తెలుసుకొని, మోసపోయానని గ్రహించి, కొడకండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల విచారణలో లక్ష్మక్కపల్లికి చెందిన నలుగురు పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకున్ని మోసం చేసినట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి వారి నుంచి రూ.30వేలు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు పాలకుర్తి, దేవరుప్పల, ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, రమేష్‌ను అభినందించారు. సమావేశంలో ఎస్సై యాకుబ్‌హుస్సేన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుడి పేరుతో జరిమానాలు ?

- ట్రాఫిక్ పోలీసులపై సోషల్ మీడియాలో ప్రచారం



సోషల్ మీడియాలో వచ్చిన రశీదు

మహబూబాబాద్ రూరల్ : శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ పేరుతో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారని సోషల్ మీడియాలో ఆదివారం విస్తృత ప్రచారం జరిగింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు హల్‌చల్ చేస్తున్నారని, ఆగి ఉన్న వ్యక్తులను తీసుకొచ్చి డ్రంకెన్ డ్రైవ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తుతెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. వినాయక నవరాత్రి ఉత్సవ రశీదులపై ఫైన్ రాస్తూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని అందులో పేర్కొన్నారు. రశీదుపై మాత్రం డబ్బులు రాసినట్లుగా కనిపించలేదు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం కాస్తా వైరల్ కావటంతో ఈ విషయమై ట్రాఫిక్ ఎస్సై భద్రునాయక్ ను వివరణ కోరగా తాము ఎలాంటి రశీదులు ఇచ్చి డబ్బులు అడగమని తెలిపారు. కేవలం మీ సేవా కేంద్రాల్లో మాత్రమే జరిమానాలు చెల్లించాలని వాహనదారులకు తెలియజేస్తామన్నారు. వారు అక్కడ చెల్లించి వచ్చి మీ సేవ రశీదు చూపిస్తే వాహనాన్ని పంపిస్తామని వివరణ ఇచ్చారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

కమలాపూర్: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని మాచనపల్లికి చెందిన డిగ్రీ విద్యార్థిని బండారి వైష్ణవి (19) ఆదివారం అదృశ్యమైనట్లు కమలాపూర్ ఎస్సై మోటం సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఈనెల 7న కళాశాలకు సెలవు ఉండటంతో కమలాపూర్ మండలం ఉప్పలపల్లిలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. చుట్టుపక్క ఇళ్లలో వెతికినా కన్పించలేదు. దీంతో విద్యార్థిని మేనమామ తన అక్కకు ఫోన్ కనుక్కోగా.. అక్కడకు కూడా రాలేదని తెలియడంతో.. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్యవైశ్యులకు సముచితస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



హాకా చైర్మన్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, తదితరులు

మరిపెడ/మరిపెడ రూరల్: ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించడంతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం ఇచ్చి పాలనలో భాగస్వాములను చేశాడని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హాకా చైర్మన్‌గా మండలం బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన మచ్చా శ్రీనివాసరావు ఇటీవల బాధ్యతలు చేపట్టాడు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా మరిపెడకు వస్తున్న మచ్చా శ్రీనివాసరావుకు వంటికొమ్ము స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, మానుకోట ఎంపీ మాలోతు కవిత హాజరయ్యారు. ముందుగా హైదరాబాద్ నుంచి వచ్చిన హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావుకు మండలంలోని తానంచర్లలో ఆర్యవైశ్యులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి వందలాది బైక్‌లతో ర్యాలీగా మరిపెడకు చేరుకొని, కార్గిల్ సెంటర్ నుంచి వివిధ రకాల కళాకారులు నృత్యాలు, డప్పు చప్పుళ్లు, బాణా సంచా కాలుస్తూ గార్డెన్స్‌కు చేరుకున్నారు. అనంతరం డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. మచ్చా శ్రీనివాసరావు సర్పంచ్ నుంచి సేవా దృక్పథం కలిగి ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యులకు సీఎం కేసీఆర్ ఉన్నతమైన పదవి కట్టబెట్టాన్నారు. మంత్రి సత్యవతి మాట్లాడుతూ.. బుర్హాన్‌పురం సర్పంచ్‌గా శ్రీనివాసరావు తన స్వగ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలిపాడని అన్నారు. ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హాకా చైర్మన్‌ను నియమించడం జరిగిందన్నారు. ఇప్పుడు మళ్లీ కేసీఆర్ ఈ పదవిని గుర్తించి ఆర్యవైశ్యుల నుంచి శ్రీనివాసరావుకు కట్టబెట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయడానికి ఆర్యవైశ్యులు అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్యుల భవన నిర్మాణానికి ఎకరం స్థలం ఇవ్వడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్, జెడ్పీ చైర్మన్ ఆంగోతు బిందు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చాపల యాదగిరిరెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు గుగులోతు సింధు, రామ్మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు నాళ్ల నర్సింహారావు, తల్లాడ వెంకటరామారావు, ఉప్పల నాగేశ్వర్‌రావు, గౌరి శంకర్, అరుణ, రాంబాబు, శారద, రవీందర్‌నాయక్, కొంపల్లి శ్రీధర్ రెడ్డి, రాంలాల్, కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఎస్సై రాత పరీక్షలు



పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థులకు సూచనలిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల పాటు జరిగిన సబ్ ఇన్‌స్పెక్టర్ల రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పోలీస్ ఉద్యోగాల నియామకాల్లో భాగంగా శని, ఆదివారాలు జరిగిన ఎస్సై రాత పరీక్షలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 21 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పరీక్షకు 14,076 మందికి గాను 13,456 మంది హాజరు కాగా 620 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన నాల్గవ పేపర్‌కు 13,412 మంది అభ్యర్థులు హాజరుకాగా, 664 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అయన తెలిపారు. ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులను కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా హాల్‌లోకి అనుమతించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు రూట్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో ఏసీపీలు, డీసీపీ స్థాయి అధికారులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా పనిచేసిన డీసీపీలు మురళీధర్, కరుణాకర్, అబ్దుల్ బారీ, సీతారాం, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ అంకిత్ కుమార్, రీజనల్ కో ఆర్డినేటర్ అనంద్ కిషోర్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బందిని సీపీ రంగనాథ్ అభినందించారు.

వేపపుల్లకోసం వెళ్తే ప్రాణంపోయింది..



మైబు (ఫైల్)

చెన్నారావుపేట: వేపపుల్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల సూర్యపేట తండాలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన 3వ వార్డు సభ్యుడు ధారావత్ మైబు (42)కు ఎకరం పది గుంటల భూమి ఉంది. ఆదివారం మొక్కజొన్న పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. అనంతరం పళ్లపుల్ల(వేపపుల్ల) కోసం బావి దగ్గర ఉన్న వేప చెట్టు వద్దకు వెళ్లాడు. వేపపుల్ల తెంపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడు. అప్పటికే నీళ్లు అయిపోవడంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. కాగా, ఉదయం చేను వద్దకు వెళ్లిన మైబు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెలక వద్దకు వెళ్లారు. బావి వద్ద చెప్పులు కనిపించడంతో బావిలోకి చూశారు. దీంతో జారి పడినట్లు గుర్తించారు. బయటికి తీసి చికిత్స కోసం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మైబుకు భార్య సుజాత, కుమారుడు మధు, కూతురు హేమలత ఉన్నారు. కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ రాంపూర్ హైవే సాక్షి ఆఫీస్ కందకట్ల గ్లాస్‌మార్ట్ వెనుకాల 200 M దూరంలో Full LRS Paid 220 గజాల ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర॥ 7416182409. [W-785512]

FLAT FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26911]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26913]

■ వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26915]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26917]

SERVICES

■ హౌజ్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, కాంట్రాక్ట్, వారికి ఆర్థిక సహాయం చేయబడును. హన్మకొండ. సెల్: 8790379618. [W-6942]

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-03]

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్‌ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1801]

WANTED

■ WGL, HNK హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ (స్త్రీ/పు), సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ (స్త్రీ/పు) కావలెను. సంప్ర॥ 7670963531, 0870-3569177. [W-785513]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000–20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై సంప్ర: 9000408325. [G-785706]

■ శ్రీలక్ష్మి హోమ్ కేర్: Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 16k-18k రూం+మీల్స్‌ఫ్రీ ✆ 9347148051 [G-540]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785707]

■ మ్యాన్‌పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact: Mega Group ManPower & Security. Cell: 70326 10569, 70931 25169. [NA-5483]

■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040-66366664, 9392663777, 9246663777 [HA-1330]

■ కాంట్రాక్టు పద్ధతి లో హాస్పిటల్ లో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ నర్స్, జూ. డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అ.కా.ను. Sal: 23k-37K ఇంట్రెస్టెడ్ ఉన్నవారు రెజ్యూమ్ వాట్సాప్ చేయగలరు. ఫోన్: 6281159171 [HA-29125]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K ఫోన్: 9848571888 [H-793408]

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-08]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బారసాలకు దుస్తులు కొనేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో మామ అల్లుడు మృతి
- మానుకోట జిల్లా మరిపెడ మండలంలో ఘటన




బానోతు రమేష్ మృతదేహం

మరిపెడ రూరల్: తెల్లవారితే కుమారుడి బారసాల ఘనంగా చేద్దామనుకున్నాడు.. మామతో కలిసి నూతన వస్త్రాలు కొనేందుకు వెళ్లారు.. కానీ, రోడ్డు ప్రమాదంలో ఆ మామ అల్లుడు మృత్యువాతపడ్డారు. ఈ బాధాకరమైన ఘటన మానుకోట జిల్లా మరిపెడ మండల పరిధిలో బుర్హాన్‌పురం వద్ద ఆదివారం జరిగింది. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం గ్రామానికి చెందిన మామ బానోతు రమేష్ (50), తన మనుమడి(బిడ్డ కొడుకు) బారసాల నిమిత్తం నూతన వస్త్రాలు కొనేందుకు అల్లుడు సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కాంపాడు గ్రామానికి చెందిన ధరావత్ పవన్ (30)తో కలిసి మరిపెడ మండల కేంద్రానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బుర్హాన్‌పురం గ్రామ శివారు బృహత్ పల్లె ప్రకృతి వనం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ సంఘటనలో మామ, అల్లుడు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు పవన్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తెల్లవారితే(నేడు) కుమారుడి బారసాలతో ఇల్లంతా బంధుమిత్రులతో పండుగ వాతావరణం చోటు చేసుకునే క్రమంలో మామ అల్లుడు చనిపోవడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నేడు మిర్చి కొనుగోళ్లు జరిగేనా..!

- బస్తాల బరువుపై లేఖ రాసిన చాంబర్ ఆఫ్ కామర్స్
- కొనుగోలు చేయమని మార్కెట్ కమిటీకి అల్టిమేటం



మార్కెట్ కార్యాలయంలో ఉన్న ఫ్లెక్సీలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో 25 కిలోల పైన 49 కిలోల లోపు ఉన్న మిర్చి బస్తాలను కొనుగోలు చేస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు మార్కెట్ కమిటీకి లేఖ రాయడంతో సోమవారం మిర్చి కొనుగోళ్లలో ప్రతిష్టంభన ఏర్పడే అవకాశాలున్నాయి. గత నెల 11న మంత్రి దయాకర్‌రావు అధ్యక్షతన కలెక్టర్లు, మార్కెట్ కమిటీ, మార్కెటింగ్‌శాఖ, చాంబర్ ప్రతినిధులు, వివిధ రైతు సంఘ నాయకులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారు లేఖలో పేర్కొన్నారు. మిర్చి బస్తాల బరువు విషయంలో మార్కెట్ కమిటీ రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమైందని చాంబర్ ప్రతినిధులు ఆరోపిస్తుంటే.. ఈవిషయంలో అడ్తిదారులు, ఖరీదుదారులకు కూడా బాధ్యత ఉందని మార్కెట్ కమిటీ పేర్కొంది. మిర్చి బస్తాలను తీసుకువచ్చే రైతులకు బరువుపై పూర్తిగా అవగాహన లేక పోవడం వల్ల సోమవారం జరిగే క్రయ, విక్రయాల్లో ఇబ్బందులు జరిగే అవకాశాలున్నాయి. గత వారం కూడా ఈ అంశంపై సుమారు గంటన్నర పాటు కొనుగోళ్లలో ప్రతిష్టంభన ఏర్పడిన విషయం తెలిసిందే. మార్కెట్ కమిటీ రైతులకు అవగాహన కల్పించేందుకు సుమారు రూ.3లక్షలు వెచ్చించి ప్రింటు చేయించిన ఫ్లెక్సీలు కార్యాలయంలో పక్కన పడవేయడం విశేషం.

నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగ భర్తీ!



జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం

- జిల్లా సంక్షేమ శాఖ(డీడబ్ల్యూఓ) ఆఫీస్‌లో ఇష్టారాజ్యం
- తప్పుడు నోట్‌ఫైల్ పెట్టి అప్రూవల్!

కాశీబుగ్గ సెంటర్: జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో నిబంధనలేం పాటించకుండా మంచిర్యాల జిల్లాలో డీసీపీయూ ఆఫీస్‌లో పీఓ-ఎన్‌ఐసీగా విధులు నిర్వహిస్తున్న ఒకరు 24 ఆగష్టు 2020లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. విచిత్రం ఏంటంటే.. అంతకంటే ముందే 8 జూలై 2020న వరంగల్ జిల్లాలో పీఓ-ఎన్‌ఐసీ పోస్టులో తిరిగి ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా నేరుగా ఉద్యోగంలో చేరారు. మంచిర్యాల కలెక్టర్ అనుమతి లేకుండానే వరంగల్ జిల్లా అధికారులు 8 జూలై 2020న నిబంధనలకు విరుద్ధంగా బదిలీ ఆర్డర్ పాస్ చేసినట్లు సమాచారం. సొసైటీ సర్వీస్ రూల్స్ ప్రకారం బదిలీల ప్రక్రియకు ఎక్కడా జీఓలు లేవు. కానీ.. ఇక్కడ మాత్రం సొసైటీ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా అధికారులు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారనే విమర్శలున్నాయి. ఈవిషయంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో మంది ఎంఎస్‌డబ్ల్యూ పూర్తి చేసిన నిరుద్యోగులు తమకు అన్యాయం చేయడం అధికారులకు తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం చేయలేనని రాజీనామా చేసిన మంచిర్యాల జిల్లా వాసికి ఇక్కడ కొలువు ఎలా ఇస్తారని పలువురు నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మహిళా శిశు శాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా భర్తీ చేసిన ఉద్యోగాల విషయంలో పూర్తి విచారణ చేపట్టి స్థానికులకు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

విచారణ చేపట్టాలి



వరంగల్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో నిబంధనల మేరకు నియామకాలు జరగలేదు. ఉద్యోగాల భర్తీ కోసం బహిరంగ ప్రకటన చేయకుండా స్థానిక నిరుద్యోగులకు అన్యాయం చేయడం సరికాదు. ఈ విషయంలో పూర్తిగా విచారణ చేపట్టి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీని నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన వారికి అవకాశం కల్పించాలి.

– గోక రాజు, ఉప్పరపల్లి గ్రామం